

# అనగనగా...కథలు

## - డా.శైలజ చందు



## సముద్రపు ఒడ్డున

కృష్ణ నీళ్లు నల్లగా, చల్లగా వుంటాయి.

దిగితే తెలుస్తుంది వెచ్చదనం.

★★★★

ఊళ్లో అందరూ ఐలూరు తిరునాళ్ల కెళ్తున్నారు.

"నాన్నా, నేనూ, తమ్ముడూ కూడా వెళ్తాము " శకుంతల అడిగింది తండ్రిని.

"వద్దమ్మా, జనాలెక్కువొస్తారు."

"నరసయ్యా, పిల్లల్ని మా బండిలో తీసికెళ్తాలే." గోడ మీద నుండి నాంచారమ్మ కేకేసింది.

"కాదే అప్పా. తొక్కిడిగా వుండదూ."

"నువ్వు తీసుకెళ్లేది లేదు,ఆళ్లనీ పోనీవు. మా పిల్లలతో బాటు వస్తార్లే."

"నాన్నా, వెళ్తాం నాన్నా." అక్క తండ్రిని అడుగుతుంటే పక్కనే నిలబడ్డాడు రఘు, తండ్రి సరేననే దాకా.

రఘు తండ్రి నరసయ్యది కట్టెల అడితీ వ్యాపారం. ఇంటి ముందే కట్టె పేళ్లు పేర్చి వుండేవి.

పిల్లలు చిన్నవాళ్లుగా వుండగానే, నరసయ్యకు భార్య పోయింది. మళ్లీ పెళ్లి చేసుకోలేదు. పొలం గట్టు పక్కన అచ్చమ్మింటికి ఎప్పుడన్నా పోయొస్తుంటాడు. మగాడి కష్టమ్ముందు, 'ఈ పోవడం, రావడం, అదో విషయమా' అని పెద్దగా పట్టించుకోరు వూరి మనుషులు.

★★★★

తిరణాలకు వెళ్లేందుకు వూరంతా వుత్సాహంగా వుంది. తెల్లవారక ముందే ఎడ్లకు, బళ్లకు అలంకారం చేసి వుంచారు.

నాంచారమ్మ ముదురాకు పచ్చ నేత చీర కట్టుకుని వచ్చింది. ఉతుకుపడని కొత్త చీర!

ముందుగా నదికి వెళ్లారు. కృష్ణమ్మ రెండు పాయలు దాటుకుంటూ పోవాలి.

ఇసక మీద సరసరమంటూ గాలి నడిచిన నడకలుమాత్రమే వున్నాయి.

మెత్తటి ఇసక, చల్లని గాలి. వెచ్చని వుదయపు ఎండ.

పారుతోందా, నిశ్చలంగా వుందా అన్నంత నెమ్మదిగా వుంది యేరు.

కృష్ణ నీళ్లు నల్లగా వున్నాయి. అడుగు కనిపిస్తోంది. ముదురాకు పచ్చగా అడుగు కనిపిస్తే, అటు వేపు వెళ్లొద్దని అక్క చెప్పింది.

అది అఖాతమట.

మనుషులు గుంపుగా వున్న చోట కాకుండా, కొద్దిగా దూరంగా వెళ్లాడు రఘు. స్నానం చేసేందుకు అడుగు పెట్టాడు. నది నీరు వెచ్చగా వుంది. కంఠం చుట్టూ సుడులు తిరుగుతోంది. గుస గుసగా గుండెను పలకరిస్తోంది. లోపలికి రమ్మని మెత్తగా ఆహ్వానిస్తోంది. అడుగు పడుతుంటే కాళ్ల కింద ఇసక గుంత పడుతోంది.

ముదురాకు పచ్చ నల్లదనంలోకి అడుగు వేశాడు. పాదం ఆనడం లేదు. కాళ్లకి ఆసరా అందడం లేదు. కృష్ణ తనలో పొదుపుకుంటోంది. నిలువెల్లా ప్రేమతో ముంచేస్తోంది. ఊపిరాడనంతగా వుక్కిరి బిక్కిరి చేస్తోంది.

★★★★

అక్క అతని జుట్టు పట్టుకుని ఈడ్చేవరకూ ఏం జరిగిందో తెలియదు. అందరూ గుమిగూడారు. అతను కళ్లు విప్పి చూశాక, అందరూ వూపిరి పీల్చుకున్నారు.

"ఎంత ప్రమాదం తప్పిందీ?"

"శకుంతల గానీ చూసుకోకపోతే?"

"తమ్ముడికి ప్రాణం పోసింది."

నీళ్ల వంక చూశాడు. కృష్ణ మీద కోపం రాలేదు. భయమూ వెయ్యలేదు. క్షణ కాలమైతేనేమి మత్తులోకి జారిపోతున్నట్లుంది. ఎంత ఇష్టమైతే తనని లాగేసుకుంటుంది.

ఆ నల్లదనం, ఆ వెచ్చదనమే గుర్తొస్తోంది.

నాంచారమ్మ హడిలిపోయింది. నరసయ్యకు తెలిస్తే ఇంకేమైనా వుందా?

కొంగుతో, రఘు తల తుడిచి, "ఏరా, బయమేసిందా?" అని పలకరించి,

"ఏం జరగలేదు లేవే. కృష్ణ దయగలది. బయం లేదు.” శకుంతలతో చెప్పింది.

పంపు దగ్గర పిల్లలందరికీ అన్నాలు పెట్టింది. తెల్లవారు జామునే వండిందేమో, అన్నం వెచ్చగానే వుంది. కేరేజి గిన్నె లో అన్నం, గోంగూర పచ్చడి వేసి కలిపి శకుంతల చేతికిచ్చింది,

"ఆడిక్కూడా పెట్టవే" అంటూ.

పిల్లలంతా తిరునాళ్లలో తిరుగుతున్నారు.

ఎముకల గూడు వంటి ఓ ముసలాయన, పెద్ద ముళ్లకంప మీద సన్నని పంచె పరచి పడుకున్నాడు, భీష్ముడిలా.

ఆ పక్కనే ఓ తల్లి, కండువా పరచి పసి బిడ్డని పడుకోబెట్టింది. బిడ్డకు వళ్లంతా రక్తపు మరకలు.

ఇంకెవరో వంటికి రక్తాలోచ్చేట్టు కొరడాతో కొట్టుకుంటున్నారు.

అడుగడుక్కీ, భయంతో అక్కకు కరుచుకుపోతున్నాడు.

అంతా రంగుల రాట్నం ఎక్కుతుంటే, తమ్ముణ్ణి తీసుకెళ్లింది. చేతిలో వున్న డబ్బులు రంగుల రాట్నం మనిషి కిచ్చి తననీ తమ్ముణ్ణీ తిప్పమంది. చెరొక ఇరవై పైసలవుతుందన్నాడు.

ఆమె ఇచ్చిన దానికి ఒకర్నే తిప్పుతానన్నాడు.

అయితే తమ్ముణ్ణి ఎక్కించమంది.

పిల్లలందరూ సరదాగా నవ్వుతున్నారు. ఉత్సాహంతో అరుస్తున్నారు. ఒక రెండు నిముషాలు మామూలుగానూ, తర్వాత మూడు నిముషాలు అతి వేగంగా తిప్పాడు. రఘుకు కడుపులో తిప్పుతోంది. భయమేస్తోంది. పక్కకు పడిపోతున్నాడు.

సన్నని ఇనుప చువ్వని గట్టిగా పట్టుకున్నాడు.

తలపక్కకు వాలిపోతోంది.

‘ఆపండీ, ఆపండీ’ అని అరుస్తున్నాడు, ఎవరికీ వినబడనంత గట్టిగా! లోలోపలే.

దిగాక బావురుమంటూ అక్కని చుట్టుకున్నాడు.

"మరీ తేగలాంటి పిల్లాడు. మెత్తగా వున్నాడు."

"తోడబుట్టింది ఎంత చూసుకుంటే ఏమి, తల్లి వున్న తీరు వేరు."

రఘుని చూసి ఆడవాళ్లు అనుకున్నారు.

★★★★★

కాలేజీ కెళ్లాలంటే వూరు దాటిపోవాలి. శకుంతల పది దాటి చదవనంది. ఇంటిని చూసుకుంటూ, తండ్రికి సాయంగా వుంది.

రఘుని హాస్టల్లో వుంచి చదివించాడు నరసయ్య. ఎవరితో మాట్లాడకపోయినా చదువులో చురుకుగా వుండేవాడు. మిత భాషి. తనలో తనైనా మాట్లాడుకోవడం తక్కువే.

రఘు మేథమేటిక్స్ లో ఫస్ట్ వస్తుండడంతో , ఇంజినీరింగ్ వైపు వెళ్లమన్నారు స్కూల్లో టీచర్లు.

తమ పొలం కౌలు చేసే భూపతికి, శకుంతలనిచ్చి పెళ్లి చేశారు. పెళ్లయాక ఇల్లరికం వచ్చాడు భూపతి. మావగారి అడితీ వ్యాపారం కూడా చూసుకునే వాడు.

శకుంతల పెళ్లి నాటికి రఘుకి వైజాగ్ పోర్ట్ ట్రస్ట్ లో వుద్యోగం వచ్చింది.

క్వార్టర్స్ ఇచ్చారు. ఆఫీసు పనయ్యాక, ఇంటి దగ్గర పిల్లలకు మేథమేటిక్స్ చెప్పేవాడు.

★★★★

ఓ సారి జ్వరం వచ్చిందతనికి. సెలవు పెట్టడడమెందుకని, టేబ్లెట్లు వేసుకుని ఆఫీసుకెళ్లాడు. పని చేస్తూ చేస్తూ, నీరసించి సొమ్మగిల్లితే హాస్పిటల్లో చేర్చారు తోటి వారు.

మలేరియా అన్నారు. ఇంటిదగ్గర ఎవరూ లేరని కోలుకునే వరకూ హాస్పిటల్లో వుండమన్నారు. ఒక వారం వుండాల్సి వచ్చింది.

అతని బెడ్ మీద నుండి పక్కకు తిరిగి చూస్తే విశాఖ సముద్రం కనిపిస్తూ వుండేది. నీలంగా!

ఆ నీలాన్ని ఎంత సేపు చూసినా కొత్తగానే వుండేది.

దట్టమైన కృష్ణ నలుపు గుర్తొచ్చింది.

సముద్రం నీలం కూడా హాయిగానే వుంది.

★★★★★

ఆ హాస్పిటల్లో కేరళ నర్సులు పని చేసేవారు. ఉదయం పూట, డాక్టర్లూ , పెద్ద నర్సులతో హడావుడిగా వుండేది.

మధ్యాహ్నానికి హాస్పిటల్ సద్దు మణిగేది.

ఆ షిఫ్ట్ లో వచ్చే నర్స్ నెమ్మదిగా చూసేది. నల్లటి పిల్ల. కళ్లొక్కటే కనిపించే ముఖం. మళయాళీ జుట్టుని వుద్యోగానికి తగినట్టుగా ముడుచుకుని వచ్చేది.

నొప్పి లేకుండా ఇంజెక్షన్ చేసేది.

ఆ శ్రద్ధ , నెమ్మది తనం, వుద్యోగం కోసం తెచ్చిపెట్టుకున్నవి కాదనిపించేది రఘుకి

ఆ పిల్లే అంత అనుకునేవాడు.

మెత్తగా మాట్లాడుతుంది. మళయాళం కలిసిన తెలుగు.

అతను లేవలేకపోతున్నపుడు, నెమ్మదిగా లేపి రెండు చేతుల్తో సపోర్ట్ చేస్తూ దిండు కానించి కూర్చోబెట్టింది.

వేడి సూప్ తాగించింది.

చల్లదనం, వెచ్చదనం.

కృష్ణ గుర్తొచ్చింది.

నల్లటి కృష్ణ.

ఓనాడు కూనిరాగం తీస్తూ ఇంజెక్షన్ లోడ్ చేస్తోంది.

"ఇది తెలుగు పాట కదా." అడిగాడామెను.

"ఇల్లై. మళయాళం."

"తెలుగు పాటనుకున్నాను. ఏదీ పెద్దగా పాడు."

'ఆకాశం పొన్నాలినిలగళె

ఆయాత్తిల్ తొట్టేవరం'

రెండు లైన్లు పాడింది.

"అంటే?"

'తూనీగను రమ్మంటోంది.

రావిచెట్టుకు వుయ్యాల వేద్దామని

ఆకాశాన్ని అంటుకుని వద్దామని.'

'అలాగా' అన్నట్లు తలవూపాడు.

"తెలుగులో కూడా ఇదే అర్థమా??"

“ఊహూ, ఆకాశం ఏనాటిదో, అనురాగం ఆనాటిది” పదాలు చెప్పాడు.

తను ఒకరితో ఇంతలా మాట్లాడడం, అదీ ఆడపిల్లతో !

రఘుకే చిత్రంగా అనిపించింది.

“ఇదే చివరి ఇంజెక్షన్.” చేస్తూ చెప్పిందామె.

“డాక్టర్ చెప్పారు. రేపే డిశ్చార్జ్ అని.”

“మంచిది.” చెప్పింది.

“మధ్యాహ్నం నువ్వొచ్చే సరికి వెళ్లిపోతాను.”

కల్యాణికి పై పెదవి మీద ఒక పుట్టు మచ్చ వుంది.

అది అక్కడుండడం బాగుందని చెప్పాలనుకున్నాడు.

ఆ విషయం, చెప్పే హక్కు తనకుంటే బాగుండు కదా అనుకున్నాడు.

“కల్యాణి, నీ ఫోన్ నంబరిస్తావా?”

ఆమెకు కోపం వస్తుందేమోననుకున్నాడు గానీ, చిన్న చీటీ మీద రాసిచ్చింది.

★★★

“మళయాళీ పిల్లా?” నోరెళ్లబెట్టింది శకుంతల.

రఘు వంక చూస్తూ ' వీడికింత ధైర్యం ఎలా వచ్చిందా?’ అని చూసింది.

“ఊళ్లో అంతా నవ్వరూ? మొన్నే నాన్న ఏడూరైంది. అప్పుడే పెళ్లి తొందరేంటి?” అడిగింది.

రఘుకి చిన్నతనం వేసింది.

“అంతా పెళ్లి చేసుకోమంటున్నారు. అందుకనీ.” అంటూ నసిగాడు.

తమ్ముడికి సంబంధాలు వస్తూనే వున్నాయి. ఇప్పుడప్పుడే చేసేది లేదని తిప్పి పంపుతోంది వాళ్లను.

"రంగేనా పిల్ల?"

కాదన్నట్టు తలూపాడు. కల్యాణి నలుపు.

"మరింకేమి. ఆ మాత్రప్పిల్ల మనూళ్లో దొరకదా?"

కల్యాణి ఫోన్ నంబర్ ఇస్తూ చూసిన చూపు గుర్తొచ్చింది.

అక్కకు ఎలా చెప్పాలో అంటూ ఆలోచిస్తున్నాడు. తమ్ముడి ఆలోచన కనిపెట్టింది.

"ఎందుకురా భాష కాని పిల్ల. ఆళ్లూ ఇమడలేరు. మనమూ ఇమడలేము. మెత్తటోడివని ఆడిచ్చేస్తది. పెద్ద రంగూ కాదాయె. నిన్ను బాగా చూసుకునే పిల్లని జూస్తాగా."

బట్టలు వుతకడానికి తీసుకెళ్తూ చెప్పింది.

దగ్గరి వాళ్లకు ఓ అమాయకత్వం వుంటుంది. మనకేమి కావాలో వాళ్లకే తెలుసన్న అమాయకత్వం.

కాసేపాగి "నీ జేబులో దొరికింది." అంటూ తడిసిపోయిన చీటీ తెచ్చింది.

అంకెలు అలుక్కుపోయాయి.

'తను ఫోన్ చేస్తుంటానని కల్యాణి ఎదురు చూస్తుందా?' ఆలోచిస్తున్నాడు.

"పొద్దున సుగ్రీవుడొచ్చాడు. ఆళ్లమ్మాయినిస్తామని అడుగుతున్నాడు. పిల్ల తెల్లగా వుంటది. రెండెకరాల పొలం , బంగారం అదీ ఇస్తామంటున్నారు."

అతనిష్టం వేరే వుంటుందన్న తలపూ ఆమెకు లేదు.

అక్కను కాదనే తెగువా తమ్ముడికి లేదు.

★★★★★

వరలక్ష్మి కాపురానికొచ్చింది.

ముదురు వంకాయ రంగు సిల్కు చీర, తలనిండా ఎర్రటి కనకాంబరాలు పెట్టుకుని.

కొత్త కాపురం కుదుట పడేవరకూ శకుంతల తోడుంటానని వచ్చింది.

మొదట్లో వదినా అంటే అమ్మాయనుకుంటూ ముచ్చటగానే వుండే వారు. రాన్రానూ, గొడవలయ్యేవి. శకుంతల పెత్తనాలు చేయడం వరలక్ష్మికి నచ్చేది కాదు.

అక్కడ గొడవేమిటో సమస్య ఎక్కడుందో , ముడి ఎలా విప్పాలో తెలిసేది కాదతనికి. అర్థం కావడానికవి మేథ్స్ లా సింపుల్ గా వుండేవి కావు.

రాత్రి ఇంటికొచ్చేసరికి ఇద్దరూ అలిగి పడుకునే వారు. రఘు ఎవరితో మాట్లాడినా రెండో వారికి కోపం.

కొట్టిందనీ, రక్కిందనీ ఆనవాళ్లు చూపించేందుకు పోటీలు పడేవారు..

ఓ రాత్రి అతనింటికొచ్చే సరికి గొడవ పడి కూర్చున్నారు.

“అది ఎట్టాంటిదో నీకు తెలియదురా. నువ్వెల్లిపోయాక ఎంత ఆడిస్తుందో నీకేం తెలుసు. పాములాంటి మడిసి. ఎన్ని చేస్తదనుకున్నావూ. అన్నం వండి లోపల దాసుకుంటది.”

శకుంతల గొంతులోకి ఏడుపొచ్చింది.

“వుండనంటే వుండను. నేపోతాను. నన్ను పంపించూ” అంటూ యేడుపాపడం లేదు వరలక్ష్మి.

“ముందు అన్నం తిను రా. తర్వాత తీసుకెళ్తా.” బుజ్జగించబోయాడు.

పళ్లెం తోసేసింది. అన్నం కూరా ఇల్లంతా చెల్లా చెదురుగా పడ్డాయి.

శకుంతల ఇంట్లోనుండి పోతే తప్ప తిననంది.

అంతా వింటోన్న శకుంతల వచ్చి, "ఒసేయ్, నా తమ్ముడింటికి నేనొచ్చా, నువ్వెవరివే నన్ను పొమ్మనడానికి?"

అతని ముందే హోరాహోరీ వాదించుకున్నారు. దేని గురించి వాదనో, ఏమి తీర్పు చెప్పాలో తెలియక తలపట్టుకుని కూర్చున్నాడు.

ఇంటికెళ్లాలంటే భయం. వెళ్లకపోతే ఇంకా భయం, ఏం కొట్టుకుంటున్నారోనని.

★★★★

ఆ మర్నాడు, ఆఫీసు నుండి , చెట్ల మధ్య తన క్వార్టర్స్ వేపు నడుస్తుంటే అంతా తననే చూస్తున్నట్లు అనిపించింది.

అంత విచిత్రమేమిటో అర్థం కాలేదతనికి.

హాల్లో కూర్చుని చేటలో బియ్యమేరుతోంది శకుంతల.

‘వరలక్ష్మి లోపలుందేమో.’

లోపలికి వెళ్లాడు. ఎక్కడా లేదామె.

“నువ్వెళ్లాక నాతో గొడవేసుకుని ఇంటికెళ్లిపోయిందిరా.”

“ఎలా వెళ్ళింది? ఎక్కడికి వెళ్ళింది?” బయటికి పరిగెత్తబోయాడు.

“పొద్దునే ఎల్లిపోయింది. ఈ పాటికి వూరు చేరిపోయుంటది.”

“అలా ఎలా. ఏవైంది?” భార్య గురించి అతను కంగారు పడడం అక్కగారికేం నచ్చలేదు.

★★★★

ఆఫీసుకి సెలవు పెట్టి మావగారింటికెళ్లాడు. అక్కడికెళ్లడానికి నిలువెల్లా పిరికితనమావహించింది. వరండాలో కూర్చోబెట్టాడు మావ. వరలక్ష్మి ఎక్కడుందో కనిపించ లేదు. గుమ్మం దగ్గర చిన్న పిల్లలు తొంగి చూస్తున్నారు, కొత్త అల్లుడి వంక.

సుగ్రీవుడు మాట్లాడుతుండగానే చుట్టుపక్కల వాళ్లు చేరారు. పది మంది గుమి గూడేందుకు నిముషం పట్టింది.

"నీకిచ్చామంటే ఏమిటి? పట్నంలో వుద్యోగముందని, పిల్ల సుకంగా బతుకుద్దని. నీ అక్క చేత తన్నులు తింటానికా?పిల్లని పంపాలంటే నీ అక్క నీ ఇంటికి రాగూడదు.” అన్నాడు మావ.

శకుంతల భర్త భూపతి కూడా వచ్చాడు.

“బావమరిది అమాయకుడనీ, వాడికివేమీ తెలియవ”నీ సర్ది చెప్పబోయాడు.

తలా ఒక తీర్పు చెప్పారు. తీర్మానాలు చేశారు.

తెలివిలేనోడు, తెగువలేనోడు పెళ్లెందుకు చేసుకున్నాడన్నారు.

తమ్ముడు మావగారింటికెళ్లాడన్న సంగతి విని పూనకాలు తెచ్చేసుకుంది శకుంతల. పరువు తీశావంది. దాని బదులు నాకింత విషం తెచ్చిపెట్టకపోయావా అంటూ నేలకు తలబాదుకుంది.

గుండెకు శాంతిలేదు. కంటికి నిద్రలేదు. ఎవరితో ఏం మాట్లాడితే ఏమవుతుందోనని మౌనంగా కూర్చున్నాడు. అక్క వండిపెడుతుంటే తిన్నాననిపిస్తున్నాడు.

రోజుకోకబురు తెస్తోంది శకుంతల.

“దానికి మేనమావఁ కొడుకుతో స్నేహితం. అది దాసి పెట్టి పెళ్లి జేశారు. నిండా మునిగిపోయామురా. నువ్వూ నేనూ.”

మౌనంగా కూర్చున్న తమ్ముడి పై అనుమానంగా చూసింది. ఇంకా వాడు దానిమీద మనసు పెట్టుకున్నాడేమోనని. అలా జరగకూడదని పక్కనే కూర్చుంది.

“విడి కాయితాలకోసం జూస్తన్నారంట! పీడా పోయిందనుకో.”

" ఇట్టాంటోళ్ళని వెయ్యిమందిని తెస్తా. ఒకడితో ఆగే మడిసి కాదురా అది.”

కాసేపైనా వరలక్ష్మి గురించి మాట్టాడకపోతే బాగుంటుందనిపిస్తోంది.

వెలపరమొస్తోంది.

“అక్కా, ఇక ఆమె గురించి ఎందుకూ. వదిలెయ్యొచ్చుగా.”

తమ్ముడు నిష్టూరమాడుతున్నాడు. భార్య గురించి చెడ్డగా వినడానికి అతను తయారుగా లేడు.

శకుంతల తట్టుకోలేక పోయింది.

"అంతేరా, కళ్ళలో పెట్టుకుని పెంచాను నిన్ను. ఈనాటికి అదెక్కువైపోయింది." అని దణ్ణెమ్మీద బట్టలు తెచ్చి సంచీలో కుక్కుకుంది.

★★★★★★

కొన్నాళ్ళ పాటు వూరుకుని, తమ్ముడిని మళ్ళీ పెళ్లి చేసుకోమంది శకుంతల.

మాట్లాడలేదు.

“చేసుకోపోతే చేతకానివాడి వనుకుంటార్రా.”

‘తనకేం చేతవును?’ ఆలోచించాడతను.

వరలక్ష్మిని ఇష్టపడడం చేతనయిందా?

ఏడిస్తే బతిమాలడం వచ్చిందా?

“అది మళ్లీ పెళ్లి చేసుకుంటంది. తెలుసా?

దానికన్నా మంచి పిల్లని తెచ్చి చేస్తా. దాని మొహమ్మీద కొట్టినట్టు.”

మళ్లీ పెళ్లి చేసుకోవాలా?

చేసుకోవడానికి తనకేం తెలుసని?

అలిగితే సముదాయించడమెలా?

కోపమొస్తే కాచుకోవడమెలా?

రఘు మౌనంగా వున్నాడు.

"ఏరా, ఏమ్మాట్లాడవూ? పట్టాభి వాళ్లు రెడీగా వున్నారు. నీతో అవుననిపించుకుని వస్తానని వచ్చా. ఏదో ఒకటి చెప్పు."

"వద్దు."

★★★★★

కొచిన్ పోర్ట్ లో ఖాళీ వుందని తెలిసి అప్లై చేసుకున్నాడు. ఆ వుద్యోగం సులభంగానే దొరికింది.

సముద్రానికి దగ్గరలో ఇల్లు తీసుకున్నాడు.

చక్కటి చిన్న ఇల్లు. ఇంటి ముందు పచ్చికతో వుండే గార్డెన్.

కిటికీ పక్కనే కొబ్బరి చెట్టు నిలబడి వుండేది.

కిచెన్ తలుపు తీస్తే, గుబురాకులతో దట్టమైన పొద లాంటి మామిడి చెట్టు. గట్టి మామిడి కాయలు కాసింది.

రాత్రిపూట కిటికీ నుండి సముద్రాన్ని చూస్తూ గడిపేవాడు. కొచిన్ సముద్రం విశాఖ సముద్రం కంటే నీలం తక్కువ. ఎప్పుడైనా ఊదారంగులో వుండేది. చాలా సార్లు బూడిద రంగులోనూ.

పేవ్ మెంట్ కొండ రాళ్లను అలలు బలంగా తాకుతుండేవి.

కష్టపడి పని చేస్తున్నందుకు ప్రమోషన్లు వచ్చాయి.

అక్క పిల్లల చదువులకు, వేడుకలకు సాయం చేశాడు తప్ప వూరికి దూరంగా వున్నాడు.

ప్రమోషన్ పరీక్షలకు, గ్రూప్ వన్ పరీక్షలకూ కోచింగ్ చెప్తున్నాడు రఘు. మొదట కొంతమంది పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటే వారికి సహాయం చేశాడు. వాళ్లకు మంచి రాంక్స్ వచ్చాక మరికొంత మంది చేరారు. ఒకరిద్దరితో మొదలైన కోచింగ్ క్లాస్ ఇప్పుడు నలభయి మందికి చేరింది.

ఆఫీసు పనయ్యాక అది ధ్యాసంతా పరీక్షల కోచింగ్ మీదే వుండేది. పరీక్షల్లో ఎటువంటి ప్రశ్నలొస్తాయో ఊహించి, ఆ రకమైన మోడల్ పేపర్లు తయారు చేస్తుండేవాడు. అతని దగ్గర కోచింగ్ తీసుకుంటే చాలు, తప్పకుండా మంచి రాంక్ వస్తుంది అన్న పేరొచ్చింది.

ఆఫీసు పనయ్యాక అదే అతనికి ఇష్టమైన వ్యాపకం.

జీవితంలో ఇప్పుడు తనకెవరున్నారని చూసుకుంటే బెన్నీ ఒకడు కనిపించాడు. బెన్నీ డ్రైవరే కానీ ఇంటి పనులన్నీ చేసి పెడతాడు. వంట కూడా అతనే!

నడివయసు మనిషి. కానీ బలంగా వుండేవాడు.

రఘు కన్నా ఒకటి రెండేళ్లు చిన్నవాడేమో.

కష్టం తెలిసిన చేతులు.

ఇల్లంతా చక్కగా సర్ది పెడతాడు. చిరునవ్వు చెరగనీయడు.

క్లాసులు జరిగే సమయంలో బెన్నీ వంట చేసేవాడు. వంట చేసే సమయంలో అతనికి ఫోన్లు వస్తుండేవి. భార్య మీద అరుస్తూ వుంటాడెందుకో. అరుపులే తప్ప కోపం వినిపించేది కాదు.

'ఎందుకలా అరుస్తావు బెన్నీ' అని అడిగే చనువు లేదు, అంత భాషా రాదు రఘుకి.

క్లాసయ్యాక, ఇంటిముందున్న గార్డెన్లో టేబుల్ వేసి భోజనం పెట్టేవాడు బెన్నీ. ఎర్రటి మట్టి పిడతలో చేపల పులుసు వండి, వేడి అన్నంలో వడ్డించేవాడు. దూరంగా సముద్రం, అలలు , వేడి భోజనం! తింటుంటే తనకూ ఆకలుందని ఆశ్చర్యపోయాడు రఘు.

భోజనమయ్యాక నిద్ర పోవడంలో సుఖం తెలిసేది. మర్నాడు బెన్నీ వచ్చేవరకూ వళ్లు తెలియని హాయి నిద్ర!

★★★★★

మెల్ల మెల్లగా మళయాళం అర్థమవుతోంది రఘుకి.

రఘుకి అర్థం అవుతోందన్న విషయం బెన్నీకింకా తెలియదు. తన ధోరణిలో తను మాట్లాడుతూ అరుస్తుండేవాడు భార్య మీద.

"నేను వచ్చి వంట చేస్తాను. అంతవరకూ కిచెన్లోకి వెళ్తే కాళ్లు విరగ్గొడతా, జాగ్రత్త" అంటూ అరుస్తున్నాడు.

మరో సారి బుజ్జగిస్తాడు.

"ఊరుకో తల్లీ, నా మాట వినూ. అలా అనొద్దూ. మాత్రలు వేసుకో తగ్గుతుంది" అని.

ఆమెకు ఆరోగ్యం అంతగా బాగుండదని తెలిసింది.

ఆ ఫోను సంభాషణ వినకూడదని రఘు కి అనిపిస్తున్నా, కుటుంబం మీద బెన్నీ ప్రేమ చూస్తుంటే తెలియని హాయి కలిగేది.

★★★★

ఓ నాడు ఉదయమంతా మంచుగా వుంది. ఎండ లేదు. పచ్చిక మీద బూడిద రంగు మంచు కరగనే లేదు.

ఆ రోజు బెన్నీ రాలేదు.

కనుక్కుందామని జీప్ తీయబోతుంటే బెన్నీయే వచ్చాడు. ఎప్పుడూ లేనిది కంగారుగా వున్నాడు.

కూతురుకి బాగోలేదనీ, అందుకే లేటయిందనీ చెప్పాడు. తెల్లవారుజామున కడుపులో నొప్పి అయితే హాస్పిటల్లో చేర్చానన్నాడు.

రఘుయే జీప్ డ్రైవ్ చేస్తూ హాస్పిటల్ కు తీసుకెళ్లాడు.

దార్లో చెప్పాడు.  కూతురు ఇంటర్ చదువుతోందట. కడుపు నొప్పి, వాంతులవుతుంటే టేబ్లెట్ వేశాడట. తగ్గకపోవడంతో హాస్పిటల్లో చేర్చానని అంటున్నాడు.

డాక్టర్ తో మాట్లాడితే అపెండిసైటిస్ అనీ,  సర్జరీ అవసరమనీ చెప్పారు.

సంగతి విని బెన్నీ నీరు కారిపోతున్నాడు. ఏడుపొకటే తక్కువ.

“ధైర్యంగా వుండు. నేనున్నాగా” అంటూ పక్కనే కూర్చున్నాడు రఘు.

భయపడుతూనే సర్జరీ కాగితాలపై సంతకం చేశాడు.

సర్జరీ అయే వరకూ అక్కడే వున్నాడు రఘు. తనక్కడ లేకపోతే బెన్నీ ఎంత కంగారు పడివుండేవాడో అర్థమైంది.

ఓ గంట తర్వాత సర్జరీ చేసిన డాక్టర్ వచ్చి మాట్లాడారు.

“లాపరోస్కోపిక్ సర్జరీ చేశామనీ, అంతా చక్కగా జరిగిందనీ ప్రమాదమేమీ లేదని” చెప్పారాయన.

"మీరు లేకపోతే ఏమయ్యేవాడిని సార్.”  అన్నాడు.

కాసేపు తోడు కూర్చున్నాడు తప్ప అక్కడ తను చేసిందేవిటో రఘుకి నిజంగానే అర్థం కాలేదు.

ఇంకొకరికి భరోసా ఇవ్వగలిగినపుడే మనకు ధైర్యం కలిగేది.  మొదటి సారి తను ఇంకొకరికి ధైర్యం చెప్పడం వింతగా వుంది రఘుకి.

హాస్పిటల్ నుండి వచ్చేస్తూ , బెన్నీ జేబులో డబ్బు పెట్టాడు. వద్దనలేదు బెన్నీ.

బిక్కమొహంతో నిలబడ్డ బెన్నీ కొత్తగా కనిపించాడు రఘుకి.

బెన్నీ భార్య, ఆ అమ్మాయి తల్లి ఎక్కడ వుందో. కనపడలేదు.

★★★★★★

డిశ్చార్జ్ చేశారట బెన్నీ వాళ్ల అమ్మాయిని.  చూసేందుకు అతనింటికి వెళ్లాడు రఘు. అదే మొదటి సారి ఆ ఏరియాకు వెళ్లడం.

అమ్మాయి కోలుకుంది. బాగానే వుంది. “జెస్సీ, మా సార్” అంటూ పరిచయం చేశాడు.

చక్కటి పిల్ల. బెన్నీలా తెల్లగా లేదు.

నల్ల కలువ.

ఆ అమ్మాయి బాగానే వున్నా , ఆపరేషన్ తాలూకు అసౌకర్యం ఆమె ముఖంలో తెలుస్తూనే వుంది.

"ఇంకొన్నాళ్లు హాస్పిటల్లో వుంచకపోయావా? పూర్తిగా కోలుకునే వరకూ!" అడిగాడు రఘు.

"వాళ్లమ్మ చూసుకుంటది సార్. ఆపరేషన్ థియేటర్లోకి కూడా వాళ్లమ్మే తోడు వెళ్లింది."

“మోళె, మోళె” అంటూ పిలిచాడు భార్యని. జెస్సీ వాళ్లమ్మ కాబోలు లోపల్నుండి వచ్చింది. జెస్సీ రంగు ఎవరిదో ఆమెను చూస్తే అర్థమైంది.

"మోళె, మా సార్." అంటూ ఆమెతో చెప్పి,

“మా మోళె ఇది వరకు ఆ హాస్పిటల్లో పనిచేసేది సార్. ఆరోగ్యం బాగోవడంలేదని నేనే మానేయమన్నా. ఇంట్లో అంతా నేను చెప్పినట్లు జరగాల్సిందే.” డాబుసరిగా చెప్తున్నాడు బెన్నీ.

మెత్తగా నవ్వింది ఆమె.

ఆమె పెదవి మీద పుట్టుమచ్చ వికసించింది.

పుట్టు మచ్చకు తను గుర్తుండే అవకాశమే లేదనుకున్నాడు.

రఘు తిరిగి వచ్చేస్తుంటే బయటి వరకూ, బెన్నీ తోడొచ్చాడు.

“బెన్నీ, నీ భార్యా, బిడ్డ అదృష్ట వంతులు. చల్లగా వుండాలి. ”

ఆ చల్లదనం

ఆ నల్లని ఛాయ.

ఆ వెచ్చదనం.

కృష్ణ ఎక్కడో లేదు. సముద్రం వొడ్డునే!

*(వచ్చే నెల మరో అనగనగా.....)*

Post your comments